క్లుప్తంగా

ముందస్తు అడ్మిషన్లపై చర్యలేవీ?

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభానికి ఐదు నెలలు ముందుగా అడ్మిషన్స్ చేస్తున్నారని, అలాంటి కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు రవిశంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కడప నగరంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా, ఎటువంటి అనుమతులు లేకపోయినా కార్పొరేట్ విద్యాసంస్థలు తమకు ఇష్టం వచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తూ ముందస్తు అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు రాజేష్, అమర్‌రాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ నిర్మించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర విభజన చట్ట ప్రకారం కడప జిల్లాలో నిర్మించాల్సిన ఉక్కు పరిశ్రమపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ అన్నారు. సంబంధిత సమస్యను బుధవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్య దర్శి జయవర్ధన్, అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి సుబ్బమ్మ, జిల్లా నాయకురాలు అరుణకుమారి పాల్గొన్నారు.

కాలభైరవుడికి పూజలు

కడప కల్చరల్ : శ్రీ కాలభైరవపురం (ఎమ్మెస్ కొట్టాల)లోగల శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవ స్వామికి బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమావాస్య కావడంతో అర్చకుడు శ్రీధర్‌శర్మ ప్రత్యేకంగా మూలమూర్తికి అభిషేకం, భక్తులచే సామూహికంగా అష్టోత్తర పారాయణం చేయించారు. అనంతరం స్వామి వారిని కనుల పండువగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మొక్కులు గల భక్తులు ప్రత్యేకంగా గుమ్మడికాయలపై దీపాలు వెలిగించి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కుష్మాండ పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలి

కడప వైఎస్సార్ సర్కిల్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు 2014లో ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారని, 2024లో కూడా అదే ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు అందించారన్నారు. అయితే, రెండు సందర్భాల్లోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి న్యాయం జరుగలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించడంలో, నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమైన కేంద్ర ప్రభుత్వంను చంద్రబాబు గట్టిగా నిలదీయలేకపోయారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం సహకరించనప్పుడు, టీడీపీ ప్రభుత్వం ఇంకా ఎన్డీయేలో ఉండటానికి ఏమాత్రం అర్హత లేదన్నారు.

ఇళ్ల స్థలాల పేరుతో కూటమి కపట నాటకం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి , శివప్రసాద్

కడప కార్పొరేషన్: ఇళ్ల స్థలాలు ఇస్తామని కూటమి ప్రభుత్వం కపట నాటకానికి తెరతీసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పొట్టిపాటి జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్ విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణాల్లో ఉన్న పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో వారికి మూడు సెంట్లు ఇవ్వాలని ఇటీవల కూటమి ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. రెండేళ్లలో ఇళ్లు కట్టుకోని వారి స్థలాలను తిరిగి తీసుకుంటామని చెప్పడం అభ్యంతరకరమన్నారు. వాస్తవానికి ఇళ్ల స్థలాలు ఇచ్చే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని, ప్రభుత్వ స్థలాలను, ఖాళీ జాగాలను టీడీపీ నాయకులకు దోచిపెట్టడమే ప్రభుత్వ ఎజెండాగా కనిపిస్తోందన్నారు. 14 ఏళ్ల టీడీపీ పాలనలో పేదలకు సెంటు స్థలం కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఇప్పటికే ఆ పార్టీ నాయకులు ఎక్కడ ఖాళీ స్థలాలు ఉన్నా కబ్జాలు చేసేస్తున్నారరన్నారు. మహానేత వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు మాత్రమే కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఒక్క కడప నగరంలోనే 23 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ కన్వీనర్ పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ఆర్ఐ తోటకృష్ణ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం.. తరలివచ్చిన భక్తజనం


కడప రాయిడి గ్రామోత్సవంలో భక్తుల సందడి


మహిళల కోలాట ప్రదర్శన


భక్తులకు అన్నదానం


వేడుకను తిలకిస్తున్న భక్తులు


ఆకట్టుకున్న భజన కార్యక్రమం

దేవుని కడపలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ధ్వజారోహణం వేడుకగా నిర్వహించారు. కడపరాయుడికి వేకువజాము నుంచే విశేష పూజలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా భక్తులు తరలివచ్చి దేవదేవుడిని దర్శించుకున్నారు. మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులందరికీ అన్నదానం చేశారు. – ఫొటోలు: రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

పూజల వేళ.. ట్రాఫిక్ కష్టాలు





శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. కానీ క్షేత్ర స్థాయిలో అమలు చేసే విధానాలు ఎలా ఉంటాయో ఈ చిత్రాలు తెలిజేస్తున్నాయి. తొలిరోజు ధ్వజారోహణ కార్యక్రమానంతరం సాయంత్రం ఊంజల సేవ తర్వాత చంద్రప్రభ వాహనం ద్వారా మాడవీధుల్లో స్వామి వారు విహరిస్తారు. అయితే ఈ కార్యక్రమంలో కళాకారులు నృత్యాలు చేసేందుకు అవస్థలు పడ్డారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఇష్టానుసారంగా మాడవీధుల్లో తిరగడాన్ని నియంత్రించకపోవడం, వాహన సేవలకు ఆటంకంగా మారింది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు లేకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. – ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ఈడీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కడప జోన్ ఈడీ పైడి చంద్రశేఖర్‌ను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఈడీని కలిసి వినతిపత్రం అందించారు.ఈసందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు మాట్లాడుతూ ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన జీతాలు ప్రకారం కార్మికులకు కాంట్రాక్టర్లు ఇవ్వడం లేదు. ఇచ్చే వేతనాల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్ ద్వారా వేతనాలు సక్రమంగా నిర్ణీత తేదీల్లో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ సెక్రెటరీ ఎస్.ఆర్.శేఖర్, ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ అధ్యక్షులు రామాంజనేయులు, ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ సెక్రెటరీ అంకిరెడ్డి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు విజయ్, జిల్లా కార్యదర్శి స్టీఫెన్ ఆంటోనీ, జిల్లా నాయకులు శ్రీనివాసులు, శివశంకర్, గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పేదలకు జీవనోపాధి కల్పించేందుకు కృషి

కడప కార్పొరేషన్: పట్టణాల్లో పేద ప్రజలందరికీ వారి సామర్థ్యం, నైపుణ్యం ఆధారంగా జీవనోపాధిని కల్పించి, అన్ని కుటుంబాల తలసరి ఆదాయం పెంచుటకు మున్సిపాలిటీలను సమన్వయం చేసుకుని మెప్మా కృషి చేస్తుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎంఎస్ఎంఈ కో ఆర్డినేటర్ షేక్ షర్ఫుద్దీన్ అన్నారు. బుధవారం కమిషనర్ అధ్యక్షతన సిటీ లైవ్‌లీ హుడ్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో రాబోయే 5 ఏళ్లకు లైవ్‌లీ హుడ్ యాక్షన్ ప్లాన్ రూపొందించుటకు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెప్మా, సిటీ లైవ్‌లీ హుడ్ యాక్షన్ ప్లాన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమం మున్సిపాలిటీల్లో ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పట్టణ పేదలకు జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడం, నైపుణ్య అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పరిశ్రమలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు స్వయం సహాయక సంఘ సభ్యులతో సిటీ లైవిలిహుడ్ టాస్క్-ఫోర్సు కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రాంతాల్లో జీవనోపాధి అవకాశాలను పెంపొందించే విధంగా కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన చేశామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు మునిసిపాలిటీ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు సహకరించాలన్నారు.

ఎస్పీని కలిసిన మాజీ డిప్యూటీ సీఎం


జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌కు మొక్క అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: జిల్లా నూతన ఎస్పీ ఈజీ అశోక్ కుమార్‌ను మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం సాయంత్రం ఎస్పీని ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువా కప్పి మొక్క అందజేసి ఘనంగా సన్మానించారు. ఎస్పీ అశోక్ కుమార్ నేతృత్వంలో జిల్లాలో శాంతిభద్రతలు మెరుగ్గా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్, షఫీ, తోటక్రిష్ణ, చాన్‌బాషా, అహమ్మద్ పాల్గొన్నారు.

మీడియా సహకారంతో ప్రజా రక్షణకు కృషి


జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్‌ను కలిసిన జాప్ నాయకులు

కడప అర్బన్: జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్) కడప జిల్లా శాఖ జిల్లా నూతన ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కడప జిల్లా పోలీసు కార్యాలయంలో జాప్ కడప జిల్లా అధ్యక్షులు మాదాల వెంకటేశ్వర్లు నేతృత్వంలో సభ్యులు కొత్త ఎస్పీని కలిసి శుభాకాంక్షలను తెలియజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జర్నలిస్టులకు సురక్షితమైన పని పరిస్థితులు కల్పిస్తామన్నారు. గతంలో తాను కడపలో పనిచేసిన అనుభవంతో పాత్రికేయులతో వున్న సంబంధాన్ని మరింత బలపరిచి, మీడియా సహకారంతో ప్రజారక్షణకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాప్ అధ్యక్షులతో పాటు నాయకులు ఎల్లారెడ్డి, ఎం.నాగేష్‌నాయుడు, ఎం. రామాంజులు, ఎస్. రామప్రతాప్‌రెడ్డి, దానం, చిట్టిబాబు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టండి

కడప కార్పొరేషన్: జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని దళిత ఫోరం జిల్లా కన్వీనర్ బూసిపాటి కిశోర్ కోరారు. బుధవారం జిల్లా నూతన ఎస్పీ ఈజీ అశోక్ కుమార్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల ఒంటిమిట్ట మండలం పెన్నపెరూరులోను, బద్వేల్ సమీపంలోని సి.కొత్తపల్లిలో దళితులపై పాశవికంగా దాడులు జరిగాయన్నారు. ఈ ఘటనల్లో కేసుల నమోదు చేసే విషయంలో కూడా రాజకీయ ఒత్తిళ్లు ఎదురవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కేసులు నమోదు చేయించాల్సి వచ్చిందన్నారు. ఇలాంటి ఘటనల విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఎస్పీని కలిసిన పెనుబాల

జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్‌ను దళిత నేత, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత పెనుబాల విజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి మొక్క అందజేశారు. ఎస్పీ దృష్టికి ఆయన పలు సమస్యలను తీసుకెళ్లారు.

ఎస్పీకి సన్మానం


ఎస్పీని కలిసిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ఎస్పీ అశోక్ కుమార్‌కు కడప ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వేద పఠనం చేస్తూ జిల్లాకు ఆహ్వానించారు. బుధవారం పాఠశాల డైరెక్టర్ ఎం. వివేకానందరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు.

1 నుంచి రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం


వార్షికోత్సవం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ 50వ వార్షికోత్సవం ఫిబ్రవరి 1 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎ.శ్రీధర్, అర్చకులు పిడతల గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం ఆలయంలో ఇతర సభ్యులతో కలిసి వారు ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈఓ మాట్లాడుతూ ఈనెల 1న ఉదయం 4 గంటల నుంచి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహిస్తామని, 2న ఉదయం 4 గంటలకు కుంకుమార్చన ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు 108 మంది ముత్తయిదువులచే మాంగల్యపూజ నిర్వహిస్తామన్నారు. 3న ఉదయం 4 గంటలకు కుంకుమార్చన, సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకార సేవ, సుమంగళిపూజ, దశహారతులు తదితర పూజలు ఉంటాయని తెలిపారు.

వేతనాలు పెంచాలని వినతి


కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అజాముద్దీన్, ఎస్ఎండి.ఖాసీం, రామసుబ్బారెడ్డి, ఆనంద్ కోరారు. బుధవారం వారు నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇస్తున్న వేతనం సరిపోక బయట అప్పులు చేయవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో పెరిగిన నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్, ఇతర చార్జీల వల్ల రూ.13 వేల జీతం ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు రోజుకు నిత్యవసర సరుకుల ధరలు పెరిగిపోయాయని, తమకు వేతనం మాత్రం పెరగడం లేదని చెప్పారు. ఇంజనీరింగ్ సెక్షన్ లో 350 మంది ఏళ్ల తరబడి పనిచేస్తున్నామని చెప్పారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు.

సేవకు ప్రతిబింబం వైద్యులు, నర్సులు

కడప కల్చరల్ : మానవ సేవకు వైద్యులు, నర్సులు ప్రతిబింబాలుగా నిలుస్తారని మానవత సేవా సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రాటాల గోపి అన్నారు. బుధవారం స్థానిక రిమ్స్‌లో ప్రేరణ, మానసిక ఒత్తిళ్లు అనే అంశంపై వైద్యులు, మెడికోలు, నర్సులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాటాల గోపి మాట్లాడుతూ సేవాభావంతో కూడిన హృదయంతో, నిజాయితీ, విలువలతో ప్రజలకు సేవలు అందిస్తే సమస్యలు ఉండవని, ఒకవేళ వచ్చినా విలువలే పరిష్కారం చూపగలవని తెలిపారు. సంస్థ సభ్యులు నీలవేణి మాట్లాడుతూ మానసిక ఒత్తిడి లేకుండా ఏయే మార్గాలను అనుసరించాలో వివరించారు. మరో సభ్యుడు రఘునాథ రెడ్డి మాట్లాడుతూ జీవితమంటే ఏమిటో తెలుసుకొని ఆధ్యాత్మిక చింతనతో నిజాయితీగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో రిమ్స్ అధికారులు డాక్టర్ జీవీ రమాదేవి, అడిషనల్ డీఎంఈ డాక్టర్ వై. శ్రీనివాసులు, సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ ఎస్ఆర్ రాజేశ్వరి, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ లిల్లీ సునీత, డిప్యూటీ సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ వై.గీత, డిప్యూటీ సీఎస్ ఆర్ఎంఓ రంగస్వామి, డిప్యూటీ కలెక్టర్ మాధురి లత పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

కడప వైఎస్సార్ సర్కిల్: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా మెగా డీఎస్సీ పై చేసిన సంతకం హామీ ఏమైందని డీవైఎఫ్ఐ కడప నగర కార్యదర్శి విజయ్ విమర్శించారు. బుధవారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప ఆర్డీఓ పరిపాలనాధికారి శంకర్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే డీఎస్సీ లేక ఏడేళ్లు అవుతోందని ఇంకా ఓపిక పట్టే పరిస్థితి యువతకు లేదని, పోరాటాలతోనే ప్రభుత్వానికి సమాధానం చెబుతాం అని హెచ్చరించారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారని వారికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. చదవాలా? వద్దా? తెలియక గందరగోళంలో డీఎస్సీ అభ్యర్థులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 117 రద్దు చేసి ప్రభుత్వ విద్య రంగాన్ని పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన 16 వేల ఉపాధ్యాయ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు ఉదయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ వందశాతం జరగాలి


అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆర్. మాధవి

కడప కార్పొరేషన్: కడప నగరంలో ఇంటింటి చెత్త సేకరణ వందశాతం అమలు చేయాలని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి సూచించారు. బుధవారం గుడ్‌మార్నింగ్ కడప కార్యక్రమంలో భాగంగా ఆమె నగరపాలక కమిషనర్ మనోజ్ రెడ్డితో కలిసి నాగరాజుపేట, కాగితాలపెంట, రాజారెడ్డి వీధి, ఎర్రముక్కపల్లె తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్లాప్ వాహనాలు ఇంటింటి చెత్త స్వీకరణ వందశాతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమర్షియల్ షాపుల నుండి వచ్చే వ్యర్థాలను సేకరించేందుకు కమర్షియల్ వాహనాలను సమకూర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, డీఈ వేణుగోపాల్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ నెరవేర్చాలి

కడప వైఎస్సార్ సర్కిల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పేదలందరికీ ఇల్లు పథకం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షల సహాయం అందించాలని సీపీఐ చేపట్టిన దశల వారి పోరాటానికి స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 27వ తేదీన జీవో నెంబర్ 23 విడుదల చేసిందన్నారు. ఈ జీవో ప్రకారం ఇంటి స్థలం పక్కా గృహం పొందాలంటే గతంలో ఎక్కడా ఎప్పుడూ ఇంటి స్థలం మంజూరు అయి ఉండకూడదన్న షరతు వల్ల రాష్ట్రంలో ఎవరికీ స్థలం రాదన్నారు. ప్రభుత్వం ఈ జీఓను సవరించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్, వెంకట శివ, సావంత్ సుధాకర్ టి. మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం రామకృష్ణ నగర్‌లోని శ్రీ సాయి శనీశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్చకుడు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీ శనీశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పుష్యమాసం బహుళ అమావాస్య సందర్భాన్ని పురస్కరించుకుని స్వామికి తైలాభిషేకం నిర్వహించారు.

అన్ని జిల్లాల వారికి అవకాశం కల్పించాలి


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు

కడప వైఎస్సార్ సర్కిల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేసి రాజధానిలో చేపట్టే ఉద్యోగ నియామకాలలో అన్ని జిల్లాల వారికి సమాన అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. లెనిన్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్ జిల్లా 15వ మహాసభలు నగరంలోని హోచిమన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జోనల్ వ్యవస్థ ఉందని, రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేయటం వలన రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారికి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాలలో సమాన అవకాశాలు వస్తాయన్నారు. డీఎస్సీపై ఇంత వరకూ అతీగతీ లేదన్నారు. 2022లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ నిమిత్తం నోటిఫికేషన్ ఇచ్చి 2025లో ఫిజికల్ ఈవెంట్స్ ఫిజికల్ మెజర్మెంట్స్ నిర్వహిస్తూ వయసు పైబడిందని వారిని నిరాకరించడం సమంజసం కాదన్నారు. తక్షణమే వారిని ఫిజికల్ ఈవెంట్స్ అండ్ మెజర్మెంట్స్ కు అనుమతించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ జిల్లా ప్రజా ప్రతినిధులు కడప ఉక్కు పరిశ్రమ సాధించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, కార్యదర్శి వి గంగా సురేష్, కార్యనిర్వాహ కార్యదర్శి కే. బ్రహ్మం, ఉపాధ్యక్షులు శివ నాగేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు శరత్, ప్రభాకర్, బలరాం నాయక్, ప్రదీప్ సంజీవ్, నాగార్జున, వి. శ్రీను, శ్రావణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు